క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ



చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

అనపర్తి: స్థానిక పాతవూరు గొలుగూరి బాపిరాజు రామాలయం వద్ద భగవాన్ వెంకయ్యస్వామి సేవా సమితి ప్రతినిధి గొలుగూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డి సతీష్‌శర్మ, నాగదేవర బాలాజీశర్మ, గొలుగూరి వీర్రాఘవరెడ్డి, సత్యనారాయణరెడ్డిలు పాల్గొని సేవలందించారు.

ఆర్టీసీ డిపోలో..

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. యూనియన్ నాయకురాలు ఎస్.శాంతికమల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డీఎమ్ యు.రామన్న ముఖ్యఅతిథిగా పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో సూపరిండెంట్ అద్దాల అప్పారావు, ఎంఎఫ్ మూర్తి, ఈయూ డిపో చైర్మన్ పైడిమళ్ల లక్ష్మణ్‌రావు, అధ్యక్షుడు ప్రగడ ప్రసాద్, శ్రీను, ఎన్ఎమ్‌యూ కార్యదర్శి మేడా శ్రీనివాస్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నిత్యాన్నసమారాధన కొనసాగుతోంది. స్వామివారి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారందరికీ భోజన వసతి కల్పించారు.

పెదరాయవరంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

రంగంపేట: మండలంలోని పెదరాయవరం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ సీహెచ్‌ఓ కె.జయమణి, ఎంపీహెచ్‌ఈఓ ఎస్వీబీ శంకర్ ఆధ్వర్యంలో 104 వైద్య శిబిరంలో సుమారు 100 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. మంచానికి పరిమితమైన రోగుల ఇళ్ల వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని చికిత్స అందించారు. వేసవిలో వడ దెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పరిశీలించిన ఎస్‌ఎస్‌ఏ సీఎంఓ



బిక్కవోలు జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన శ్రీనివాస్

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను ఎస్ఎస్ఏ సీఎంఓ కె.శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ పరిస్థితిపై ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. క్వాలిటీ చెక్ చేసి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సీఆర్‌పీ మాధవి, పీటీఐ టీచర్స్ ఉన్నారు.

ప్రైవేటు కన్నా ప్రభుత్వ విద్యాలయాలు మిన్న

రంగంపేట: కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల కన్నా ప్రభుత్వ విద్యాలయాలు మిన్న అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ శనివారం మండలంలో క్యాంపెయిన్ నిర్వహించి ఆయన మాట్లాడారు. 2022–23 విద్యా సంవత్సరంలో తమ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని తల్లిదండ్రులకు వివరించారు.

బిక్కవోలు: ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తున్నామని మెళ్లూరు ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పడాల కాశీవిశ్వనాథరెడ్డి అన్నారు. శనివారం ఆయన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. నిష్ణాతులైన అధ్యాపక బృందంతో తమ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందన్నారు.

అగ్గి రాజుకుంటే బుగ్గే

- వేసవిలో అగ్ని ప్రమాదాలకు ఆస్కారమెక్కువ
- అప్రమత్తత అవసరమంటున్న అధికారులు



అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన పశువుల పాకలు(ఫైల్)

రంగంపేట: భానుడు నడినెత్తిన నిప్పులు కురిపిస్తున్నాడు. వేసవి ఎండలకు తాళలేక ప్రజలు బయటకు రావడానికే భయపడిపోతున్నారు. ఇప్పటికే నిత్యం 40 డిగ్రీల నుంచి 45 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరోవైపు ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ రోహిణి కార్తె ఉండనుండడంతో ఇంకెంత స్థాయిలో ఉష్ణోగతలు నమోదవుతాయోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. రోజురోజుకీ పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలెక్కువ. అందుకే ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని అధికారులు చెబుతున్నారు.

సాధారణంగా వేసవి అంటే ఎండ వేడిమికి గడ్డివాములో, పూరిపాకలో దగ్ధమవుతాయని భావిస్తుంటారు. కాని విద్యుత్ లోడు అధికమైనప్పుడు లైన్లలో వచ్చే ఒత్తడి వల్ల, వైరింగ్‌లో లోపాల వల్ల, నాణ్యామైక విద్యుత్ పరికరాలు వాడని కారణంగా, ఫ్రిజ్‌లు, ఏసీలు ఉన్నచోట నాణ్యమైన వైరింగ్ లేకపోయినా, ఎర్త్ సక్రమంగా చేయించుకోకపోయినా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయి. పైగా వేసవి నేపథ్యంలో గత కొద్దిరోజులుగా విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగిందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. అందుకే అగ్ని ప్రమాదాలు జరగకుండా ఇంటింటా ఎవరికివారు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. పైగా మెట్ట ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గ్రామాల్లోని పశువుల పాకలు, గడ్డివాములు, ఎండుచెత్త ఉన్నచోట విద్యుదాఘాతం కారణంగానో, తాగిపాడేసిన సిగరెట్ల వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించిన ఘటనలున్నాయి. పైగా మెట్టప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటి చెరువులు, బావుల్లో నీరు ఇంకిపోయిన నేపథ్యంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే అగ్నిమాపక శకటం వచ్చేలోపు సర్వం బూడిదయ్యే ప్రమాదముంది. అందుకే రైతులు సైతం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది.

అగ్నిమాపక కేంద్రం ఆమడదూరం

సమీపంలో అగ్నిమాపక కేంద్రం లేని కారణంగా



అగ్నిప్రమాదానికి గురైన గడ్డివామిని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మండలంలోని ఏ గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగినా పెద్దాపురం నుంచి అగ్నిమాపక శకటాలు రావాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల అగ్నిమాపక శకటం వచ్చేలోపు జరగాల్సిన నష్టమంతా జరిగిపోతుంది. గతేడాది పెదరాయవరం గ్రామంలో ఇద్దరు రైతులకు చెందిన రెండు పశువుల పాకలు, రెండు భారీ గడ్డివాములు విద్యుదాఘాతం వల్ల దగ్ధమై సుమారు రూ.2.60 లక్షల మేర నష్టం వాటిల్లింది. అనంతరం వచ్చిన అగ్నిమాపక శకటాలు మిగతా పాకలకు, గడ్డివాములకు మంటలు వ్యాపించకుండా నివారించాయి. అదేవిధంగా రంగంపేటలో చెరకుతోటపై నుంచి విద్యుత్ లైన్లు వెళ్లడంతో వాటి షార్ట్ సర్క్యూట్ వల్ల చేతికొచ్చిన చెరకు పంట అగ్నికి ఆహుతై లక్షల్లో నష్టమొచ్చింది.

నాణ్యమైన వైరింగ్ చేయించుకోవాలి



ఇంట్లో, ఆఫీసుల్లో గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన నాణ్యమైన వస్తువులను వాడితే ప్రమాదాలు నివారించొచ్చు. అదేవిధంగా ప్రతిఒక్కరూ నాణ్యమైన వైరింగ్‌తో పాటు ఎర్త్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

– సీహెచ్ నాగేశ్వరరావు, విద్యుత్ ఏఈ, రంగంపేట

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశమెక్కువ కనుక ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ అగ్నిప్రమాదం సంభవిస్తే పోలీసుల సహాయం తీసుకోవాలి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి.

– టి.రామకృష్ణ, ఎస్ఐ, రంగంపేట

నేరేళ్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



నేరేళ్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: గండ్రేడు నేరేళ్లమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి శుక్రవారం రాత్రి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవతలను నిత్యం పూజించడం వల్ల గ్రామాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుడిపూడి మాధవీలత, ఉప సర్పంచ్ కర్రి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శివకుమార్, గుత్తుల వెంకటరమణ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

లబ్ధిదారులంతా ఇళ్లు నిర్మించుకోవాలి

రంగంపేట: నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులంతా వేగంగా ఇళ్లు నిర్మించుకోవాలని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, సర్పంచ్ వేము మాధవి కోరారు. శనివారం స్థానిక సచివాలయం వద్ద ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని కావున వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు.

సంక్షేమ పాలనలో వలంటీర్లు సేవా వారథులు



వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు



మర్రిపూడి సచివాలయం వద్ద వలంటీర్లను సత్కరించిన ప్రజా ప్రతినిధులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సత్కారం

అనపర్తి: ప్రజా సంక్షేమ పాలనలో వలంటీర్లు సేవా వారథులుగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో అనపర్తి గ్రామాల పరిధిలో సేవా రత్న పురస్కారానికి ఎంపికైన సచివాలయం–2కి చెందిన ఎంపీ రమేష్, సచివాయం–5కు చెందిన వై.సునీత, సేవా మిత్ర పురస్కారానికి ఎంపికైన 149 మంది వలంటీర్లకు ఎమ్మెల్యే పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వ్యవస్థను ప్రవేశపెట్టిన తొలినాళ్లలో దీని అమలు సాధ్యమేనా అంటూ ప్రతిపక్షాలు హేళన చేశాయన్నారు. అయితే వలంటీర్లు విమర్శించినవారి నోళ్లు మూయించేలా ప్రభుత్వానికి, ప్రజలకు వారథులుగా పనిచేస్తున్నారంటూ ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మండపేట ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పులగం బుల్లిరెడ్డి, కర్రి దాసు, సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సేవా దృక్పథంతో పనిచేయాలి

రంగంపేట: వలంటీర్లు సేవా దృక్పథంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి కోరారు. మర్రిపూడి సచివాలయంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వేము మాధవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వలంటీర్లను సేవా మిత్ర పురష్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ కన్వీనర్ వేము చిరంజీవి, పంచాయితీ కార్యదర్శి బి. గౌరీశాంతి, గ్రామ పెద్దలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు చేరువచేసేది వలంటీర్లే

బిక్కవోలు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేసేది వలంటీర్లేనని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి అన్నారు. శనివారం బిక్కవోలు పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ కరోనా వంటి కష్టకాలంలో వలంటీర్లు సేవలందించారని కొనియాడారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, రొంగల అప్పాజీ, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ దొంగకు ఆరు నెలల జైలు

సీతానగరం: మోటారు సైకిల్ దొంగతనం కేసులో విశాఖపట్నానికి చెందిన మకాల ధనకుమార్‌కు ఆరు నెలలు జైలు విధిస్తూ రాజమహేంద్రవరం అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి కోర్టు మేజిస్ట్రేట్ పి.బాబు తీర్పుచెప్పారు. 2022 జూలై 7న రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామ నగర్‌లో మోటారు సైకిల్‌ను ధనకుమార్ దొంగతనం చేశాడు. ఆ ఘటనపై హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహాలక్ష్మి కేసును వాదించారు. దొంగతనం కేసు రుజువైనందున పైవిధంగా మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. దర్యాప్తు అధికారి హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, కోర్టు కానిస్టేబుల్ ఎస్కే బీఎం షరీఫ్‌ను కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ఉమామహేశ్వరరావు అభినందించారు.

వ్యక్తిపై భార్య, ఆమె బంధువుల దాడి

సీతానగరం: వ్యక్తిపై భార్య, ఆమె బంధువులు దాడి చేసిన ఘటనపై రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రి సమచారం మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరానికి చెందిన ఆకేటి సురేష్, మల్లేశ్వరి భార్యాభర్తలు, వీరిమధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మల్లేశ్వరి ఉండేశ్వరపురంలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చేసింది. సురేష్ వచ్చి రాజమహేంద్రవరంలో కాపురం ఉందామని చెప్పగా.. రెండు నెలల తర్వాత వస్తానంది. గడువు ముగిసిన తర్వాత ఈనెల 17న సురేష్ ఉండేశ్వరపురంలో భార్య దగ్గరకు వచ్చి కాపురానికి రావాలని అడిగాడు. దీంతో మల్లేశ్వరి, ఆమె బంధువులు కలిసి సురేష్‌పై దాడి చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరాడు. ఆ ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కాయన సత్యనారాయణ, మేడిం లక్ష్మి, ఆకేటి మల్లేశ్వరి, సానా చాముండేశ్వరి, సానా కుమారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నక్లెస్ చోరీ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరానికి చెందిన పడాల లక్ష్మి తన 24 గ్రాముల బంగారు నక్లెస్ చోరీకి గురైందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు శనివారం తెలిపారు. బ్యాంకులో ఉన్న నక్లెస్ విడిపించి తన రెండో కుమార్తెకు ఈ నెల 7న ఇచ్చింది. అదే రోజు తిరిగి నక్లెస్ లక్ష్మికి ఇవ్వగా, బీరువాలో భద్రపర్చింది. ఈనెల 12న బంధువుల వివాహానికి వెళ్లడానికి సిద్ధమై బీరువాలో తెరిచి చూడగా నక్లెస్ కనిపించలేదు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జీవన నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలని జనార్దనరావు మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు సాధు వెంకట కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. యోగా గురువు లీలా సుందరి సులభ వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు నేర్పించారు. పార్వతీ పరమేశ్వర రైస్‌స్టోర్స్ అధినేత పొలసానపల్లి రాజశేఖర్, లక్ష్మి హార్డ్‌వేర్ అధినేత మద్దుల చైతన్య మజ్జిగ, స్నాక్స్ పంపిణీ చేశారు.

గోకవరం ప్రభుత్వాస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



ఆపరేషన్ చేయించుకున్న హరీష్‌తో గోకవరం ప్రభుత్వాస్పత్రి వైద్యులు

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. ఓ యువకుడి చేతిలో ఆరు నెలల క్రితం గుచ్చుకుని విరిగిపోయిన గాజుముక్కను శస్త్ర చికిత్స చేసి తొలగించారు. వివరాల ప్రకారం.. గోకవరం మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన యువకుడు వై.హరీష్ ఆరు నెలల క్రితం ప్రమాదవశాత్తు గాజు పెంకు పగిలి చేతి బొటనవేలులో ఉండిపోయింది. గత ఆరు నెలలుగా తీవ్ర బాధతో ఇబ్బంది పడుతున్నాడు. రెండు రోజుల క్రితం ప్రభుత్వాసత్రికి రాగా ఆస్పత్రి డాక్టర్ రవికుమార్ చేతికి ఎక్స్‌రే తీసి గాజుముక్కను గుర్తించారు. శనివారం సుమారు రెండు గంటల పాటు శస్త్ర చికిత్స చేసి గాజుముక్కను తొలగించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజాకుమారి మాట్లాడుతూ గోకవరం ప్రభుత్వాస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతి నెలా 70 ప్రసవాలు, 30 శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు ప్రభుత్వాస్పత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణ రక్షణ

మధురపూడి: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి, పర్యావరణాన్ని పరిరక్షిద్దామని అటవీశాఖ దివాన్ చెరువు సెక్షన్ డిప్యూటీ రేంజ్ అధికారి పద్మావతీదేవి అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా శనివారం కోరుకొండ మండలం నిడిగట్లలో ప్రజలకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడమే జీవనశైలిగా అలవర్చుకోవాలన్నారు. నీటి సంరక్షణ ద్వారా తాగునీరు వృథాకాదన్నారు. ఇంధనాన్ని పొదుపుగా వాడకపోవడంతో కొరత ఏర్పడుతోందని, ఇది సమాజ వికాసానికి ఆటంకమవుతోందన్నారు. అనంతరం నిడిగట్ల సచివాలయం పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రపర్చారు. ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ బీట్ ఆఫీసర్ జీవీ రంగారావు, అసిస్టెంట్ ఆఫీసర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

మధురపూడి: కోరుకొండ మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. తోటల్లోని మామిడి కాయలు నేలరాలిపోయాయి. నర్సాపురం, కణుపూరు,. గాదరాడ, కోటికేశవరం, రాఘవపురం, బొల్లెద్దుపాలెం గ్రామాల్లోని తోటల రైతులు ఇబ్బంది పడ్డారు. అసలే దిగుబడి తగ్గడం, పండుగా తయారయ్యే సందర్భంలో పురుగు పట్టడం లాంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతన్నలకు అకాల వర్షం మరింత సమస్యగా పరిణమించింది. మండలంలో 30 ఎకరాల విస్తీర్ణంతో జామతోటలున్నాయి. అకాల వర్షంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

రాజానగరం: మండలంలో శనివారం సాయంత్రం కారుమేఘాలు కమ్ముకున్నాయి. ఈదురుగాలులు బలంగా వీచాయి. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఏరియా నుంచి లాలాచెరువు సెంటర్ వరకూ కొద్దిపాటి చినుకులు పడ్డాయి.

డీఎల్‌పీఓ బొజ్జిరాజుకు సత్కారం



బొజ్జిరాజు దంపతులను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రాజానగరం: మండల ఈఓపీఆర్డీగా పనిచేసి, డీఎల్‌పీఓగా అమలాపురం డివిజన్‌కి బదిలీపై వెళ్లిన పి.బొజ్జిరాజును మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాలులో శనివారం వీడ్కోలు సభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం, మండల శాఖ ఆధ్వర్యంలో బొజ్జిరాజు దంపతులను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

కుటుంబ సభ్యుల చెంతకు క్షేమంగా బాలుడు

రాజమహేంద్రవరం సిటీ: ఇంటి నుంచి పారిపోయి వచ్చిన 12 ఏళ్ల బాలుడిని రాజమహేంద్రవరం జీఆర్పీ పోలీసులు శనివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. గుడివాడకు చెందిన 12 ఏళ్ల గుమ్మల తంబిబాబు ఇంటి నుంచి పారిపోయి గోదావరి రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతుండగా జీఆర్పీ పోలీసులు ఆ బాలుడిని విచారించారు. అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో తల్లిదండ్రులతో మాట్లాడారు. రెండు రోజులుగా బాలుడి ఆచూకీ కోసం వెతుకుతున్నామని వారు చెప్పారు. అనంతరం తండ్రి జోసఫ్ రాజమహేంద్రవరానికి రావాలని చెప్పి, వివరాలు ధ్రువీకరించుకున్న అనంతరం బాలుడిని అప్పగించినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ విజయశంకర్ తెలిపారు.

చెత్త ఉత్పత్తిని తగ్గించడమే ఆర్‌ఆర్‌ఆర్ లక్ష్యం



ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగర వాసులు ఉపయోగించని ప్లాస్టిక్, పాత పుస్తకాలు, దుస్తులు, చెప్పులు వంటి వాటిని నగరంలో ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాలలో అప్పగిస్తే, వాటిని రీసైక్లింగ్ విధానంలో తిరిగి ఉపయోగంలోకి తీసుకుని వచ్చేందుకు చర్యలు చేపడతామని నగర కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. మేరీ లైఫ్ స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా బైపాస్ రోడ్డులో సంజీవని మెడికల్ షాపు మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన మొదటి ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాతబట్టలు, ప్లాస్టిక్ బొమ్మలు వంటి వాటిని ఈ కేంద్రాలలో అప్పగించాలన్నారు. ఇలా సేకరించిన వస్తువులను పర్యావరణహితంగా వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. నగర వ్యాప్తంగా చెత్త ఉత్పత్తిని తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. రెడ్యూస్ – చెత్త ఉత్పత్తిని వీలైనంత తగ్గించడం, రీయూజ్ – చెత్త ఉత్పత్తికి కారణమయ్యే వస్తువులను కాలపరిమితి పూర్తి అయ్యేంతవరకు ఉపయోగించడం, రీసైకిల్ – ఆ వస్తువులను పునరుత్పాదన చేయడం వంటి చర్యలు ఈ కేంద్రాల ద్వారా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్ ఇంటి శ్రీనివాస్, శాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి అన్నమయ్య, డివైన్ మేనేజర్ లావణ్య పాల్గొన్నారు.